క్లుప్తంగా

రాయగడలో డీఆర్ఎం పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్ఎం సౌరభ్

రాయగడ: తూర్పు కోస్తా రైల్వే డివిజనల్ మేనేజర్ (విశాఖపట్నం) సౌరభ్ ప్రసాద్ శుక్రవారం రాయగడలో పర్యటించారు. విజయనగరం–రాయగడ రైలు మార్గం నిర్మాణంలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. లెవెల్ గేట్, ప్రయాణికుల సౌకర్యాలు, రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల గురించి సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. డీఆర్ఎంతో పాటు ఏడీఆర్ఎం సుధీర్ కుమార్ గుప్తా, సీనియర్ అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు. విజయనగరం నుంచి టిట్లాఘడ్ వరకు నిర్మిస్తున్న మూడో రైలు లైన్ నిర్మాణంలో భాగంగా ఆయన విజయనగరం నుండి రాయగడ వరకు జరిగే రైల్వే లైన్ పనులను పరిశీలించారు.

సముద్రంలో చిక్కుకున్న చేపల ట్రాలర్లు



ధామ్రా ప్రాంతంలో సముద్రంలో చిక్కుకున్న చేపల ట్రాలర్లు

భువనేశ్వర్: దానా తుఫాన్ తాకిడికి గురైన ధామ్రా సముద్రంలో 2 చేపల ట్రాలర్లు చిక్కుకున్నాయి. తుఫాన్ తీరం దాటడంతో పయనం సురక్షితంగా భావించి తిరుగు ప్రయాణం కోసం సన్నద్ధమై ఈ ఇక్కట్లకు గురైనట్లు భావిస్తున్నారు. ఈ రెండు ట్రాలర్లు పశ్చిమ బెంగాల్ వైపు వెళ్తున్నట్లు ప్రాథమిక సమాచారం. ధామ్రా మెరైన్ ఠాణా పోలీసులు విచారణ చేపట్టారు.


రేషన్‌లో రాగులు ఇవ్వాలి



సబ్ కలెక్టర్‌ను కలసిన బీజేడీ నేత బాలారాయ్ తదితరులు

జయపురం: మున్సిపాలిటీ ప్రజలకు రేషన్‌లో బియ్యంతోపాటు రాగులు కూడా అందించాలని జయపురం సబ్ కలెక్టర్ శౌర్య రెడ్డిని బీజేడీ నేత బాలారాయ్ శుక్రవారం కోరారు. బీజేడీ కార్యకర్తలతో కలిసి ఆయన ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల రేషన్ కార్డులు గల వారికి 60 కిలోల చోళ్లు అందించాలని ఆదేశించగా మున్సిపాలిటీ పరిధిలోని క్రిష్టియన్‌పేట, హణాగుడ, బంగ్లాబెడ, బిజురాజ్‌నగర్ డిపోల పరిధిలో చోళ్లు అందించలేదన్నారు. ఆయా ప్రాంత వాసులు అధికారులకు చెప్పిన తర్వాత అందించాలని తెలిపారు. ఇలాంటి తప్పులు ఇక ముందు జరగకుండా చూడాలని కోరారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న సామగ్రితో పోలీసులు

రాయగడ: జిల్లాలోని ఎక్సైజ్, పోలీసు అధికారులు సారా తయారీ కేంద్రాలపై గురువారం విస్తృతంగా దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో 895 లీటర్ల నాటుసారా, 8,150 లీటర్ల ఊటను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఓసీ సంజయ్ ప్రధాన్ తెలిపిన వివరాల మేరకు.. సదరు సమితి పరిధి పెరిగాం గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 95 లీటర్ల నాటుసారా, 900 లీటర్ల ఊటను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గడబగుడలో 72 లీటర్ల సారా, 750 లీటర్ల ఊట, గోపాల్‌పూర్‌లో 22 లీటర్ల సారా, కాసీపూర్‌లో 16,000 లీటర్ల ఊట, 678 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు.

వర్షపాతం ఇదే..

భువనేశ్వర్: తుఫాన్ వాతావరణం ప్రభావంతో పలు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వాన కురుస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే కొన్ని చోట్ల ఆకస్మిక వరదలు తలెత్తే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. గత 24 గంటల్లో 70 మిల్లీమీటర్లు పైబడి వర్షపాతం నమోదు అయిన ప్రాంతాలు

జిల్లా	ప్రాంతం	వర్షపాతం (మిల్లీ మీటర్లు)
భద్రక్	చాంద్‌బాలి	159.6
కేంద్రాపడా	రాజకనికా	156.0
మయూర్‌భంజ్	నవానా	137.2
భద్రక్	బాసుదేవ్‌పూర్	110.0
కేంద్రాపడా	మర్శాఘాయి	110.0
బాలాసోర్	ఔపడా	109.0
కేంద్రాపడా	రాజనగర్	100.0
కేంద్రాపడా	ఔల్	80.0
జగత్‌సింగ్‌పూర్	పారాదీప్	76.4
కేంద్రాపడా	డెరాబిస్	72.0
భద్రక్	భద్రక్	70.2

నేటి నుంచి తుఫాన్ నష్టం అంచనా

- వారం రోజుల్లో బాధితులకు సాయం
- మంత్రి సురేష్ కుమార్ పూజారి వెల్లడి



మంత్రి సురేష్ కుమార్



క్షేత్రస్థాయిలో నష్టం పరిశీలనలో అధికారులు

భువనేశ్వర్: దానా తుఫాన్ కారణంగా సంభవించిన నష్టాల అంచనా శనివారం నుంచి ప్రారంభమవుతుందని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి తెలిపారు. బాధిత వర్గాలకు 7 రోజుల్లో సాయం అందజేసేందుకు సన్నాహాలు చేపడుతున్నట్లు వివరించారు. తుఫాన్ భిత్తర్ కనికా అభయారణ్యం సమీపంలో తీరం తాకింది. దీని ప్రభావంతో కేంద్రాపడా, భద్రక్ జిల్లాలు విధ్వంసానికి గురయ్యాయి. మరికొన్ని పరిసర జిల్లాలు ప్రభావితమైనట్లు భావిస్తున్నారు. వాతావరణం అనుకూలిస్తే తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బ తిన్న పంటల నష్టం ప్రాథమిక అంచనా శుక్రవారం సాయంత్రం సరికి దాఖలు చేయాలని ఆదేశించారు.

నేడు విహంగ వీక్షణ

దానా తుఫాన్ తాకిడి ప్రభావిత ప్రాంతాలను ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి శనివారం ప్రత్యక్షంగా వీక్షిస్తారు. శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో విహంగ వీక్షణంలో దెబ్బ తిన్న పంటలు, జల దిగ్బంధం వగైరా అంశాలను సీఎం పరిశీలిస్తారు. అలాగే రెవెన్యూ మంత్రి సురేష్ కుమార్ పూజారి ప్రభావిత ప్రాంతాలను సందర్శిస్తారు. 48 గంటల్లో క్షేత్రస్థాయిలో నష్టం సర్వే పూర్తిచేసి సమగ్ర నివేదిక దాఖలుకు గడువు నిర్ధారించారు.

బాధితులకు పక్కా ఇళ్లు

తుఫాన్ ప్రభావంతో ఇళ్లు కోల్పోయిన బాధితులకు పక్కా ఇళ్లు మంజూరు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. విపత్కర పరిస్థితుల్లో కూలిన ఇళ్లు, పాక్షికంగా దెబ్బ తిన్న ఇండ్లలో ఉంటున్నవారికి అర్హులుగా గుర్తించి కచ్చా ఇల్లు స్థానంలో పక్కా ఇల్లు కేటాయించడం జరుగుతుందన్నారు. కాగా తుఫాన్‌లో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ విజయం వెనక ప్రజల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను ఆచరించి సహకరించడంతో ఈ విజయం సాధ్యమైందన్నారు. గర్భిణుల సంరక్షణలో ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ఎంతో శ్రద్ధ వహించి విపత్తు నుంచి రక్షణ కల్పించారని కొనియాడారు.

లక్ష్మీ బస్సులను నడపాలి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పబ్లిక్ రైట్స్ ప్రతినిధులు

జయపురం: కొరాపుట్ జిల్లా జయపురం ఓఎస్ఆర్టీసీ బస్సు స్టాండ్‌లో తొమ్మిది నెలుగా నిలిచి ఉన్న లక్ష్మీ బస్సులను వెంటనే నడపాలని జిల్లా పబ్లిక్ రైట్స్ అసోషియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా జిల్లా కలెక్టర్‌కు రాసిన వినతి పత్రాన్ని జయపురం సబ్‌కలెక్టర్ ఎ.శౌశ్యా రెడ్డికి అసియేషన్ నాయకులు గురువారం అందజేశారు. జిల్లాలోని 14 సమితుల పరిధిలోని ప్రజలకు ఉపయోగంగా ఉంటుందనే ఉద్దేశంతో గత ప్రభుత్వం జనవరి నెలలో 12 లక్ష్మీ బస్సులను సమకూర్చిందన్నారు. అవి సమితిల నుంచి జిల్లా కేంద్రానికి నడిచేవని గుర్తు చేశారు. అయితే కొద్ది నెలలుగా బస్టాండ్‌లో నిలిపి వేయడంతో పాడవుతున్నారన్నారు. ఆగస్టులో వాటికి రూట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తూ ఆర్టీసీ అధికారులకు దరఖాస్తులు పెట్టినా నేటి వరకు మంజూరు కాలేదని ఆరోపించారు. బస్సులు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సబ్‌కలక్టర్‌కు మెమోరాండం సమర్పించిన వారిలో పబ్లిక్ రైట్స్ సభ్యులు దేవేంద్ర బాహిణీపతి, బాలా రాయ్, రాజేంద్రకుమార్ గౌడ, అరవింద దొర, భిబిత రంజన్ మహాపాత్రో, తేజేశ్వర పండ, రాజేంద్రసాహు, శరత్ అధికారి, లింగరాజ్ పాల్ ఉన్నారు.

ఆశ్రయ కేంద్రాలకు తరలింపు



ఆశ్రయ శిబిరాల్లో లూడూ కాలక్షేపంలో మహిళలు



వండిన ఆహార పదార్థాల పంపిణీ



ఆశ్రితులకు ఆహార సదుపాయం

భువనేశ్వర్: దానా తుఫాన్ నేపథ్యంలో ప్రభావిత ప్రాంత ప్రజలను ముందస్తుగానే ఆశ్రయ కేంద్రాలకు తరలించారు. ప్రభావిత ప్రాంతాల్లో 360 చోట్ల పాడి పశువులకు దాణాతో శిబిరాలు ఏర్పాటు చేశారు. వీటి సంరక్షణ కోసం 120 మంది పాడి పశువుల వైద్యులను నియమించారు. రాష్ట్రంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన ఆశ్రయ శిబిరాల్లో దాదాపు 5 లక్షల 84 వేల మంది తలదాచుకుంటున్నారు.



సంరక్షణ శిబిరంలో పశువులు

జైలులో గ్యాంగ్ వార్



ఝురపడా స్పెషల్ జైలు

భువనేశ్వర్: స్థానిక ఝురపడా స్పెషల్ జైలులో శుక్రవారం గ్యాంగ్ వార్ చోటు చేసుకుంది. కారాగారంలో ఇరు వర్గాల మధ్య చోటు చేసుకున్న వాగ్యుద్ధం చినికిచినిక గాలివానగా మారి యుద్ధ వాతావరణం నెలకొలిపింది. వారి కేకలు చెవిన పడడంతో కారాగారం అధికార యంత్రాంగం ఉలికిపాటుకు గురై పరుగులు తీసింది. ఘర్షణ పడుతున్న ఇరు వర్గాలకు సర్ది చెప్పి పరిస్థితిని అదుపులోకి తీసుకునే ప్రయత్నంలో సిబ్బంది గాయపడ్డారు. గాయ పడిన వారిలో జైలరు, మరో ఇద్దరు సిబ్బంది ఉన్నారు. పరిస్థితి చేయి దాటడంతో సైరన్ మోయించారు. ఈ మోతతో చేరువలో ఉన్న లక్ష్మీ సాగర్ ఠాణా పోలీసులు హుటాహుటిన ఝురపడా ప్రత్యేక కారాగారానికి చేరారు. ఝురపడా జైలులో రాటు దేరిన నేరస్తులతో కిటకిటలాడుతుంటుంది. భారీ స్థాయి భద్రత మధ్య అత్యంత కట్టుదిట్టంగా నిర్వహిస్తున్న పరిస్థితుల్లో ఖైదీల మధ్య యుద్ధ వాతావరణం తలెత్తడం సంచలనం రేపింది. ఈ సంఘటనపై లక్ష్మీ సాగర్ ఠాణా అధికార వర్గాలు విచారణ జరిపి నివేదిక దాఖలు చేస్తారు. నివేదిక ఆధారంగా చర్యలు చేపడతారు.

పోషకాహారంపై అవగాహన



పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం



దోరాగూడలో మహిళలకు పౌష్టికాహార ప్రాధాన్యాన్ని వివరిస్తున్న లైఫ్లీ మిషన్ సభ్యులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి దోరగూడ పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒడిశా లైవ్లీ ఉడ్ మిషన్ ఆధ్వర్యంలో పిల్లల్లో పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆకుకూరలు, రాగులు, జొన్నలు, కూరగాయాలు పిల్లలకు విరివిగా పెట్టడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ ఉద్యోగుల నిరసన

జయపురం: అంబులెన్స్ డ్రైవర్లు, ఇతర సిబ్బందిరోజుకు 12 గంటలు పనిచేయాలన్న నిబంధనలను అఖిల ఒడిశా 108 అంబులెన్స్ ఖర్మచారి మహాసంఘం కొరాపుట్ జిల్లా శాఖ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా అంబులెన్స్ సిబ్బంది జయపురంలోని జిల్లా లేబర్ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. అంబులెన్స్‌లో పనిచేసే డ్రైవర్లు, ఈఎంటీ సిబ్బంది ప్రస్తుతం రోజుకు ఎనిమిది గంటలు పనిచేస్తుండగా.. కొత్త యాజమాన్యం రోజుకు 12 గంటలు పనిచేయాలని లేఖలు పంపించడాన్ని తప్పుబట్టారు. అంబులెన్స్‌లలో ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయలేదని ఆరోపించారు. తక్షణమే ఖాళీలను భర్తీ చేయాలని మహాసంఘ జిల్లా అధ్యక్షుడు గంగాధర తంగుల్ డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా లేబర్ అధికారి బృందావణ సెట్టిని కలిసి వినతి పత్రం అందజేశారు. మహాసంఘ కార్యదర్శి ధరణీదర్ సాహుకార్, ఉపాధ్యక్షులు బుదరా పొరజ పాల్గొన్నారు.



పోలీసుల అదుపులో మద్యం రవాణా వాహనం

నకిలీ విదేశీ మద్యం జప్తు

భువనేశ్వర్: నకిలీ విదేశీ మద్యం రవాణా గుట్టు రట్టయ్యింది. అబ్కారీ శాఖ ఆకస్మిక తనిఖీల్లో భారీ స్థాయిలో నకిలీ మద్యం పట్టుబడింది. నరసింగ్‌పూర్ అబ్కారి ఠాణా పోలీసులు దాడి చేసి 2,142 లీటర్ల విదేశీ మద్యం జప్తు చేశారు. ఈ మద్యం రవాణా చేస్తున్న మోటారు వాహనంతో ఒక మొబైల్ ఫోను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఒక నిందితుని అరెస్టు చేశారు. 204 అట్ట పెట్టెల్లో 14 చొప్పున ఒక్కో క్వార్టరు మద్యంతో నిండిన సీసాల్ని జప్తు చేసినట్లు పేర్కొన్నారు.

28 నుంచి అవినీతి నిర్మూలన వారోత్సవాలు

- విజయవంతం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్, అధికారులు

పర్లాకిమిడి: ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించే అవినీతి నిర్మూళన వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ పిలుపునిచ్చారు. గజపతి జిల్లాలో పంచాయతీ, బ్లాక్, జిల్లా స్థాయిలో అవినీతి నిర్మూళన వారోత్సవాలు జరుపుకోవాలని అన్నారు. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లో ఆస్వాన్ సమావేశ మందిరంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. బరంపురం విజిలెన్స్ అధికారి ఎస్పీ గణేష్ ప్రధాన్, డీఎస్పీ వాసుదేవ రావు, ఏడీఎం రాజేంద్ర మింజ్, డీఆర్‌డీఏ కార్యనిర్వాహక అధికారి గుణనిధి నాయక్, పురపాలక ఈవో గౌర చంద్ర పట్నాయక్, తహసీల్దార్ నారాయణ బెహరాతో శుక్రవారం పాల్గొన్నారు. మిషన్‌శక్తి విభాగం ద్వారా ప్రతి బ్లాక్ స్థాయిలో 28న అధికారులతో అవగాహన ర్యాలీ జరపాలన్నారు. అనంతరం జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి వీడియో కాన్ఫరెన్సు ద్వారా అధికారులు శపథ పాఠం చేయాలని సమావేశంలో కలెక్టర్ దాస్ ఆదేశించారు.

4,15,993 దోమతెరల పంపిణీకి నిర్ణయం



వైద్య సిబ్బందితో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్

మల్కన్‌గిరి: ప్రజలకు ఏటా ఇస్తున్నట్టే ఈ ఏడాది కూడా దోమ తెరలను పంపిణీ చేసే విషయమై చర్చించేందుకు అధికారులు శుక్రవారం సమావేశమయ్యారు. జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా వైద్యాధికారి ధనేశ్వర్ మహాపాత్రో, అదనపు వైద్యాధికారి బ్రజ బంధుదాస్, ఇతర వైద్యశాఖ సిబ్బందితో దోమల తెరల పంపిణీపై చర్చించారు. జిల్లాలో ముఖ్యంగా మలేరియా ఎక్కువగా ఉన్న ఏడు సమితుల్లో 1249 దోమతెరల పంపిణీ కేంద్రాలను ఏర్పాటు 3,80,993 దోమతెరలు పంపిణీ చేయాలని తొలుత భావించారు. అయితే ఈ ఏడాది జనాభా పెరిగిన నేపథ్యంలో 4,15,993 దోమతెరలు అందించాలని నిర్ణయించారు. వీటిని అర్హులందరికీ పంపిణీ చేస్తామని జిల్లా వైద్యాధికారి ధనేశ్వర్ మహాపాత్రో తెలిపారు.

ఝార్ఖండ్‌లో ప్రచారానికి సీఎం మోహన్



భువనేశ్వర్: ఝార్ఖండ్ శాసన సభ ఎన్నికల తొలి విడత ప్రచారం కోసం భారతీయ జనతా పార్టీ స్టార్ క్యాంపెయినర్ల జాబితా శుక్రవారం విడుదల చేసింది. ఈ జాబితాలో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, సంబల్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గం సభ్యుడు ధర్మేంద్ర ప్రధాన్‌లు ఉన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వంటి ప్రముఖులతో బీజేపీ 40 మంది జాబితా విడుదల చేసింది.

సెలవులు రద్దు

భువనేశ్వర్: దానా వైపరీత్యంతో నీట మునిగిన పంట నష్టం అంచనా అత్యవసర ప్రక్రియ. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఈ చర్యని యుద్ధ ప్రాతిపదికన నిర్వహించనున్నారు. రానున్న 48 గంటల్లో నివేదిక దాఖలు చేయాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ అధికారిక సెలవు దినాలు శని, ఆదివారాల్లో అధికారులకు సెలవులు రద్దు చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, రైతు సాధికారిత విభాగం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. భువనేశ్వర్‌తో సహా దానా ప్రభావిత జిల్లాల్లో విభాగం సిబ్బందికి సమగ్రంగా ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో శని, ఆది వారాల్లో రెండు రోజులు సిబ్బంది అనుక్షణం అందుబాటులో ఉండాలని తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



సీజ్ చేసిన సామగ్రితో ఎక్సైజ్ సిబ్బంది

జయపురం: జయపురం ఎక్సైజ్ సిబ్బంది, జిల్లా ఎక్సైజ్ ఫ్లెయింగ్ స్క్వాడ్‌లు (డీఎఫ్ఎస్) సంయుక్తంగా జయపురం సమితిలో అక్రమంగా నిర్వహిస్తున్న సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. సమితిలోని పాత్రోపుట్ పంచాయతీ బెడాగుడ గ్రామ అడవిలో నిర్వహిస్తున్న బట్టీలపై దాడి జరిపి 90 లీటర్ల నాటుసారాతో పాటు సారా తయారీకి సిద్ధం చేసిన 1,900 లీటర్ల ఇప్ప ఊటను పారవేసినట్లు అధికారి శశికాంత దత్ శుక్రవారం వెల్లడించారు. పారవేసిన సారా, ఊట విలువ రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. అలాగే బట్టీల్లో సారా వంటకానికి వినియోగించే సామగ్రి సీజ్ చేసినట్లు వెల్లడించారు. దాడుల్లో డీఎఫ్ఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర పొడియారి, జయపురం ఏఎస్ఐ బ్రజబిహార ప్రదాన్ తదితరులు పాల్గొన్నారు.

శభాష్ శివాని



ఆశా కార్యకర్తతో ఫోన్‌లో మాట్లాడుతున్న సీఎం మాఝి



వృద్ధురాలిని మోసుకెళ్తున్న ఆశా కార్యకర్త శివాని

భువనేశ్వర్: దానా తుఫాన్ విపత్తు నిర్వహణ కార్యకలాపాల్లో భాగంగా ప్రమాదకర ప్రాంతాల నుంచి ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించే క్రమంలో ఆశా కార్యకర్త శివాని అద్భుతంగా సేవలందించడంపై సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆమె అంకితభావాన్ని మెచ్చుకుంటూ ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి శుక్రవారం ఫోన్ చేసి అభినందించారు. ఇల్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రభుత్వం ఎల్లప్పుడూ సాయంగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఇంజినీర్ల ఆందోళన



కలెక్టర్‌ను కలిసి వస్తున్న ఇంజినీర్లు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ సమితిలో ఇంజినీర్, జూనియర్ ఇంజినీర్లుగా విధులు నిర్వహిస్తున్న రస్మిత సాబొరొ, అశోక్ కుమార్ నాయక్‌లపై కొంత మంది కాంట్రాక్టర్లు దాడి చేశారు. దీంతో దీనిని నిరసిస్తూ ఒడిశా డిప్లమా ఇంజినీర్ల సర్వీస్ అసోసియేషన్ ఆందోళన చేపట్టింది. ఈ మేరకు శుక్రవారం ఆ అసోసియేషన్ కార్యదర్శి గిరిజా శంకర్ పతి, సలహాదారుడు రమాకాంత్ మహాపాత్రో, ఉపాధ్యక్షుడు ప్రకాష్ నారాయణ భట్‌రాయ్‌ల నేతృత్వంలో కలెక్టర్ ఫరూల్ పట్వారీ, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్‌లను కలిసి ఒక వినతిపత్రంను సమర్పించారు. ఈనెల 18వ తేదీన విధుల్లో ఉన్న ఇంజినీర్లను కొంతమంది కాంట్రాక్టర్లు అసభ్య పదజాలంతో దూషించి చేయి చేసుకున్నారన్నారు. అందువలన దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

• నీ గూడు చెదిరింది



దానా తుఫాన్‌తో గూడు చెదిరిన ఓ నక్క దిక్కు తోచని పరిస్థితిలో పడిపోయింది. భద్రక్ జిల్లా ధామ్రా తీర ప్రాంతాల్లో తిరుగాడుతూకనిపించింది.

– భువనేశ్వర్

• అహో.. మహోదయం



మల్కన్‌గిరి ప్రకృతి అందాలతో అలరారుతోంది. పచ్చని పంట పొలాల మధ్య ఈ అందమైన సూర్యోదయం చూపరులకు కనువిందు చేసింది.

– మల్కన్‌గిరి

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయిలో రాణించాలి


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన శైలజను అభినందిస్తున్న హెచ్ఎం తదితరులు

దీపురుపల్లి: రాష్ట్రస్థాయిలో జరిగే కబడ్డీ పోటీల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం రహీనా బేగం అన్నారు. అండర్–17 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పాఠశాలకు చెందిన కె.శైలజను శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 22న జిల్లాలోని రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్–17 విభాగం పోటీల్లో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా తమ పాఠశాలకు చెందిన శైలజ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయరాలు ఎం.శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా పూర్ణాహుతి


యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం తరువాత యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో జరిపించారు. గత నెల 28 నుంచి యాగశాలలో నిర్వహించిన సుందరకాండ హవనానికి పుష్యమి నక్షత్రం సందర్భంగా పూర్ణాహుతి జరిపించామని అర్చకులు ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం వెండి మంటపం వద్ద సీతారాముల కల్యాణాన్ని వేడుకగా జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, పవన్‌కుమారాచార్యులు పాల్గొన్నారు.

బాత్రూమ్‌లో జారిపడి మిమ్స్ ప్రొఫెసర్ మృతి


డాక్టర్ వెంకట పవన్ కుమార్ మృతదేహం

విజయనగరం క్రైమ్: మిమ్స్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వెంకట పవన్ కుమార్ (44) బాత్రూమ్‌లో జారిపడిపోవడంతో తలకు గాయమై మృతిచెందారు. శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. రెండు నెలల క్రితం మలేషియా నుంచి ఇక్కడికి వచ్చిన ఆయన తల్లిదండ్రులతో కలిసి మిమ్స్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. గురువారం మధ్యాహ్నం బాత్రూమ్‌లో జారిపడిపోవడంతో తలకు గాయమైంది. చిన్నదేకదా అని నిర్లక్ష్యం చేసిన ఆయన మెల్లగా నిద్రలోకి జారుకున్నాడు. అంతే రాత్రి భోజనానికి తల్లి ఎంత పిలిచినా పలకపోయేసరికి మిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే పవన్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య నవజ్యోతి మలేషియాలో వైద్యురాలిగా పనిచేస్తున్నారు. పాపతో ఆమె అక్కడే ఉన్నారు. కుమారుడు గుంటూరు హాస్టల్‌లో చదువుతున్నాడు. మృతుడి తల్లి కృష్ణవేణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై వి. అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్‌క్రైమ్ నేరాలపై అవగాహన


సైబర్‌క్రైమ్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రభాకర్

భోగాపురం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సైబర్ క్రైమ్ నేరాలపై ఆదర్శ పాఠశాల విద్యార్థులకు సీఐ ఎన్వీ ప్రభాకర్ శుక్రవారం సాయంత్రం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత ఆశయంతో ఇష్టంతో చదువుకోవాలన్నారు. సోషల్ మీడియా దూరంగా ఉండడంతో పాటు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్ చేసి బ్యాంక్ వివరాలు, ఓటీపీ నంబర్లు అడిగినా చెప్పకూడదని సూచించారు.

ప్రాణాంతకరి



ఏలికలు మాటలు కోటలు దాటుతున్నా.. గజరాజులు మాత్రం మన్యం గడప దాటడం లేదు. జిల్లాను వీడని కరిరాజులు.. వరుసగా మనుషుల ప్రాణాలను హరిస్తున్నాయి. ఒకరు కాదు, ఇద్దరు కాదు.. ఏకంగా 13 మందిని పొట్టనబెట్టుకున్నాయి. రూ.6 కోట్ల మేర పంటలకు, ఆస్తులకు నష్టం కలిగించాయి. ప్రస్తుతం జిల్లాలో రెండు గుంపులుగా ఇవి సంచరిస్తున్నాయి. అటు గిరిజన ప్రజలనే కాక.. ఇటు పార్వతీపురం, సీతానగరం మండల వాసులనూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. నిత్యం బిక్కుబిక్కుమంటూ, ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- సాక్షి, పార్వతీపురం మన్యం

- ఏనుగుల సమస్యకు పరిష్కారమెలా?
- ఇప్పటికే 13 మందిని పొట్టనబెట్టుకున్న గజరాజులు
- రెండు గుంపులుగా సంచారం
- నిత్యం భయంభయంగానే గిరిజనం

ఆంధ్రా–ఒడిశా సరిహద్దును దాటుకుంటూ 2017లో మన్యం ఏజెన్సీలోకి ఏనుగులు ప్రవేశించాయి. అప్పటి నుంచి ఎక్కడికక్కడ దాడులు చేస్తూ జిల్లాలోని గిరిజనుల ప్రాణాలు తీస్తున్నాయి. పంటలు ధ్వంసం చేస్తున్నాయి. కొద్దిరోజుల కిందట కొమరాడ మండలం వన్నాం గ్రామానికి చెందిన వాన శివున్నాయుడు(62) అనే వృద్ధుడిని తొక్కి చంపాయి. గురువారం పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామానికి చెందిన దేవాబత్తుల యాకోబు(74) మీద దాడి చేసి ప్రాణాలు తీశాయి. ఏనుగుల గుంపు ఇక్కడికి వచ్చిన తర్వాతే మరో నాలుగు ఏనుగు పిల్లలకు జన్మనిచ్చినట్లు తెలుస్తోంది. సమృద్ధిగా పంటలు, కావాల్సినంత నీరు లభ్యమవుతుండడంతో జిల్లానే తమ శాశ్వత నివాసంగా ఏర్పరచుకున్నట్లు అనిపిస్తోంది. శ్రీకాకుళం వైపు నుంచి జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపును ఒడిశా ప్రాంతానికి తరలించినా.. తిరిగి జిల్లాకు చేరుకుని కొమరాడ, పార్వతీపురం, జియ్యమ్మవలస, భామిని, సీతంపేట, గరుగుబిల్లి తదితర ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. ఇటీవల జిల్లాలో సంచరిస్తున్న ఏనుగుల సంఖ్యను నిర్ధారించేందుకు మూడు రోజులపాటు అటవీ శాఖాధికారులు సర్వే చేపట్టారు. పార్వతీపురం డివిజన్ పరిధిలో ఏడు, పాలకొండ డివిజన్ పరిధిలో నాలుగు ఏనుగులు తిరుగుతున్నట్లు గుర్తించారు.

దశాబ్దాలుగా వీడని సమస్య

ఏనుగుల సమస్య ఐదారేళ్ల క్రితానిది కాదు. ఒడిశా రాష్ట్రం లఖేరి నుంచి తొలిసారిగా 1998 అక్టోబర్ 4న కురుపాం అటవీ ప్రాంతంలోకి ఏనుగులు ప్రవేశించాయి. వాటిని తరిమేసినా.. 1999 ఆగస్టులో కురుపాం, గుమ్మలక్ష్మీపురం కొండల్లోకి వచ్చాయి. మళ్లీ వాటిని వెనక్కి పంపారు. 2007–08 సంవత్సరాల మధ్య గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, సీతంపేట, వీరఘట్టం ప్రాంతాల్లో పంటలను తీవ్రంగా నష్టపరిచాయి. ఆ సమయంలో వాటిని తరిమికొట్టేందుకు 'ఆపరేషన్ గజ'ను చేపట్టారు. ఏనుగులకు మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి ఒడిశా తరలిస్తుండగా రెండు మృతి చెందాయి. దీంతో ఆ ఆపరేషన్‌ను నిలిపివేశారు. అప్పట్లో ఉమ్మడి విజయనగరం– శ్రీకాకుళం జిల్లాల మధ్య ఎలిఫెంట్ జోన్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసినా గిరిజనుల వ్యతిరేకత నేపథ్యంలో నిలిచిపోయింది. తర్వాత కొన్ని ప్రాంతాలను జోన్ కోసం ప్రతిపాదించినా ఏదీ కార్యరూపం దాల్చలేదు.

గజరాజులకూ ముప్పే..

వన్యప్రాణులను సంరక్షించడం అందరి బాధ్యత. ఆహార అన్వేషణ కోసం అరణ్యాన్ని వదిలి, గ్రామాల్లోకి వస్తున్న ఏనుగులూ ప్రమాదవశాత్తు మృతి చెందడం ఆందోళన కలిగించే విషయమే. ఇప్పటి వరకు ఏడుకు పైగా గజరాజులు మృతి చెందాయి. గత జూన్ నెలలో గరుగుబిల్లి మండలం తోటపల్లి సరిహద్దుల్లో అనారోగ్యంతో ఓ ఆడ ఏనుగు మృతి చెందింది. 2018 సెప్టెంబర్ నెలలో ఆర్తాం వద్ద విద్యుదాఘాతానికి గురై ఒక ఏనుగు ప్రాణాలు కోల్పోయింది. ఆ తర్వాత దుగ్గి సమీపంలోని నాగావళి ఊబిలో కూరుకుపోయి మరొకటి మృత్యువాతపడింది. అంతకుముందు 2010 నవంబర్‌లో అప్పటి శ్రీకాకుళం జిల్లాలోని వీరఘట్టం (ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా) మండలం కుంబిడి ఇచ్చాపురంలో రెండు కరిరాజులు మృతి చెందాయి. కొన్నాళ్ల క్రితం 'హరి' అనే మగ ఏనుగు గుంపు నుంచి తప్పిపోయింది. నెలలు గడిచినా దాని జాడ తెలియరాలేదు. గుంపులో కలవలేదు. గతేడాది మే నెలలో జిల్లాలోని భామిని మండలం కాట్రగడ–బి వద్ద విద్యుదాఘాతంతో నాలుగు ఏనుగులు మృత్యువాత పడ్డాయి. విద్యుదాఘాతాలకు, రైతులు పంటల కోసం ఏర్పాటు చేసుకున్న రక్షణ కంచెల వల్ల, ప్రమాదవశాత్తు గజరాజులూ ప్రాణాలు కోల్పోవడం విచారకరం. ఏళ్లుగా అటు అమాయక గిరిజనులతోపాటు.. ఇటు ఏనుగుల ప్రాణాలూ పోతున్నా ఈ సమస్యకు పరిష్కారం లభించడం లేదు.

కుంకీలను పంపిస్తారా?

చిత్తూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కరిరాజుల వల్ల జరుగుతున్న నష్టాన్ని నివారించడానికి కర్ణాటక నుంచి కుంకీలను తీసుకువచ్చేందుకు గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అందులో భాగంగా జిల్లాకూ కుంకీలను పంపుతామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. కుంకీలు పూర్తిస్థాయిలో శిక్షణ పొందిన ఏనుగులు. ఇవి వస్తే ఇక్కడున్న ఏనుగులతో సహవాసం చేసి, వాటిని తమకు అనుకూలంగా మలుచుకుంటాయి. జనారణ్యంలో తిరుగుతున్న గజరాజులను తిరిగి అరణ్యంలోకి వెళ్లేలా దిశానిర్దేశం చేస్తాయి. ఇదే సమయంలో కుంకీలను తీసుకువచ్చేందుకు జిల్లాలో అనువైన పరిస్థితులు లేవని అటవీ శాఖాధికారులు చెబుతున్నారు. పెద్ద ఎత్తున నిధులతోపాటు.. కొన్ని నెలల సమయం కూడా పడుతుందని అంటున్నారు. శిక్షణ పొందిన ఏనుగులను ఉంచేందుకు క్యాంపు లేదు. ఇటువంటి పరిస్థితుల్లో కుంకీల రాకకు ఇంకెన్నాళ్లు పడుతుందోనని గిరిజన, ప్రజా సంఘాల నాయకులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటి వరకు గజరాజుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారు..

- ఏనుగుల దాడిలో జిల్లాలో ఇప్పటి వరకు 13 మంది వరకు మృతి చెందారు.
- 2019లో ఎస్.పకీరు(కొమరాడ), కాశిన్నదొర(జియ్యమ్మవలస)
- 2020లో వై.నారాయణరావు, ఆర్.లక్ష్మునాయుడు(కొమరాడ), జి.అమ్మడమ్మ(జియ్యమ్మవలస)
- 2021లో ఎ.అప్పమ్మ(కొమరాడ)
- 2022లో ఎస్.రాజాబాబు(అటవీ శాఖ ట్రాకర్), డి.గోవింద్(కొమరాడ)
- 2023లో ఎ.దాసనాయుడు(బలిజిపేట)
- 2024లో వి.శివున్నాయుడు(కొమరాడ), డి.యాకోబు(పార్వతీపురం మండలం)
- గతంలో భామిని మండలంలో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.


తోటలో పనిచేస్తుండగా గురువారం ఏనుగులు దాడిచేయడంతో మృతిచెందిన పెదబొండపల్లి గ్రామానికి చెందిన దేవాబత్తుల యాకోబు

ఏనుగుల దాడిలో మృతుని కుటుంబానికి 10 లక్షల పరిహారం


యాకోబ్ కటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర, డీఎఫ్‌ఓ ప్రసూన

పార్వతీపురంటౌన్: ఏనుగుల దాడిలో పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి గ్రామానికి చెందిన యాకోబ్ గురువారం మృతిచెందారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే విజయ్ చంద్ర, జిల్లా అటవీశాఖాధికారి ప్రసూన కలిసి శుక్రవారం అందజేశారు. వృద్ధుడు యాకోబ్ మృతి చెందడం చాలా బాధాకరమని ఎమ్మెల్యే అన్నారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, అటవీశాఖ అధికారులు స్పందించి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేశారని ఎమ్మెల్యే వివరించారు. ఎవరూ ఏనుగుల ఫొటోలు, వీడియోలు తీయొద్దని, వన్యప్రాణుల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రారంభమైన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు


ప్రారంభ అతిథుల కోసం ఎదురు చూస్తున్న క్రీడాకారులు


కృష్ణా-తిరుపతి జిల్లాల జట్ల మధ్య జరుగుతున్న పోటీ

కొత్తవలస: 68వ స్కూల్‌గేమ్స్‌లో భాగంగా రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు మండల కేంద్రంలోని విజయనగరం రోడ్డులో గల భారత్ డిఫెన్స్ అకాడమీలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ కమిటీ ప్రెసిడెంట్, జిల్లా వృత్తివిద్యాశాఖ అధికారి ఎస్.భీమాశంకర్ ప్రారంభించారు. కాగా ఈ పోటీలను ప్రారంభించేందుకు ముఖ్య ఆహ్వానితులుగా ఎంపీ శ్రీభరత్, స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని నిర్వాహకులు ఆహ్వానించడంతో వారి రాకకోసం గంటల తరబడి విద్యార్థులు మండుటెండలో ఎదురు చూశారు. వారు ఎంతకీ రాకపోవడంతో చివరికి భీమాశంకర్ పోటీలను ప్రారంభించారు. గంటల తరబడి ఎండలో నిరీక్షించిన క్రీడాకారులు అసహనం వ్యక్తం చేశారు. ఈ పోటీలకు ఉమ్మడి 13 జిల్లాల నుంచి 16 మంది క్రీడాకారులు చొప్పున హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలు మూడు రోజులు పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ రామస్వామి, భారత్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ కె.రాజు. వివిధ పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

29న సివిల్స్ సర్వీసెస్ ఉద్యోగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు


మాట్లాడుతున్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వేంకటేశ్వర రావు

విజయనగరం: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు ఈనెల 29న సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వర రావు శుక్రవారం తెలిపారు. నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్,చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, బెస్ట్ ఫిజిక్, హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్‌లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్ క్రీడాంశాల్లో స్త్రీ, పురుషులకు ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన ఉద్యోగులు వారి డిపార్ట్‌మెంట్ గుర్తింపు కార్డుతో హాజరుకావాలని కోరారు. జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని వచ్చే నెల 6 నుంచి 9వ తేదీ వరకు జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నామన్నారు. అర్హత, ఆసక్తి గల ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9177070098, 8074116276 నంబర్‌లను సంప్రదించాలని కోరారు.

30న ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడాపోటీలు

పార్వతీపురంటౌన్: ఈ నెల 30 వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లాలోని సివిల్‌సర్వీస్ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎస్.వేంకటేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్ బాల్, ఖోఖో , బెస్ట్ ఫిజిక్, హాకీ, కబడ్డి, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్ క్రీడలలో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబరు 30న ఉదయం 9 గంటలకు ఆర్‌సీఎం స్కూల్ కాంప్లెక్స్ వద్ద ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ 9866805716, 9701648344 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు గిరిజన విద్యార్థినులు


స్టేట్ లెవెల్ ఎస్‌జీఎఫ్ పోటీలకు వెళ్లనున్న బాలికలు

సీతంపేట: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమపాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినులు వెళ్లనున్నట్లు హెచ్‌ఎం పి.పద్మశ్రీ తెలిపారు.

శనివారం నుంచి జరగనున్న బ్యాడ్మింటన్ అండర్ 17విభాగంలో ఏడుగురు, అండర్ 14, 17 అథ్లెటిక్స్‌లో ఇద్దరు, హాకీ అండర్ 17లో నలుగురు, ఖోఖో అండర్ 17లో ఒకరు అండర్ 14లో ఇద్దరు, బ్యాడ్మింటన్ అండర్ 17లో ఒకరు, అండర్ 14లో ఒకరు, ఆర్చరీలో అండర్ 14, 17లలో నలుగురు విద్యార్థినులు పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు.

విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలపై దృష్టి సారించాలి

- వీసీ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్
- సెంచూరియన్‌లో టెక్-టాక్, బ్లిజ్ ఫెస్ట్ 2.0 సదస్సులు


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలపై దృష్టి సారించాలని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రశాంత కుమార్ మహంతి సూచించారు. ఈ మేరకు మండలంలోని టెక్కలి వర్సిటీలో టెక్–టాక్, బ్లిజ్ ఫెస్ట్ 2.0 కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన వీసీ మాట్లాడుతూ ఇంజినీరింగ్, ఇతర రంగాలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, డిజైన్ వంటి అంశాలపై పట్టు సాధించాలని పిలుపునిచ్చారు. బ్లిజ్ ఫెస్ట్ 2.0 కార్యక్రమాన్ని ఉద్దేశించి విశాఖ ఐఐఎం ప్రొఫెసర్ కల్యాణ్ మాట్లాడుతూ..వ్యాపార రంగంలో విద్యార్థులు విజయం సాధించాలంటే ముందుగా అవగాహన పెంచుకోవాలని సూచించారు. తమకు అవసరమైన రంగాల్లో విద్యార్థులు నైపుణ్యం సాధించాలని హితవు పలికారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న జెడ్పీ చైర్మన్


ప్రమాదంలో గాయపడిన రామును ఆస్పత్రికి తీసుకువెళ్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గుర్ల: మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పర్యటనలో భాగంగా మండలంలోని సాలిపిసోమరాజు పేట హెలిప్యాడ్ వద్ద విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాము కాలిపై నుంచి కారు చక్రం వెళ్లిపోయింది. ఈ విషయం గమనించిన జెడ్పీ చెర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆయనను తన సొంత కారులో విజయనగరం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి అవసరమైన వైద్య పరీక్షలు చేయించారు. చికిత్సకు అవసరమైన నగదును కూడా జెడ్పీ చైర్మన్ చెల్లించారు.

మన్ కి బాత్‌కు వీడీవీకే సభ్యుల ఎంపిక

సీతంపేట: వచ్చేనెల 15న జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ రేడియో కార్యక్రమానికి సీతంపేట వీడీవీకే సభ్యులు ఎంపికైనట్లు వెలుగు డీపీఎం వెంకటరమణ తెలిపారు. రాష్ట్రంలోనే సీతంపేట వీడీవీకే ఎంపికైందన్నారు. ఐటీడీఏ కేంద్రంగా నిర్వహిస్తున్న వన్‌ధన్ వికాస కేంద్రాల్లో జీడి,పసుపు, కొండచీపుళ్లు ఎలా తయారు చేస్తున్నారు? మార్కెటింగ్ సౌకర్యాలు తదితర అంశాలపై వీడీవీకే సభ్యులు ఎస్.మంగమ్మ, పార్వతి, సుజాతలు పీఎంతో మన్ కీ బాత్‌లో మాట్లాడనున్నారని చెప్పారు.

పోలీస్ సిబ్బందికి వ్యాస రచన పోటీలు


వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న పోలీస్ సిబ్బంది

పార్వతీపురంటౌన్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు–2024 భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వీ మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పోలీస్ సిబ్బంది ఈపోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీస్ సిబ్బంది ప్రస్తుత సమాజంలో ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశాలపై వ్యాసరచన నిర్వహించారు. మంచి ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేయనున్నారు. అదనపు ఎస్పీ డా.ఒ.దిలీప్ కిరణ్ సమక్షంలో పోటీలను ఎస్సైలు ఫ్రక్రుద్దీన్, దినకర్, డీసీఆర్‌బీ సిబ్బంది పర్యవేక్షించారు. ఈ కార్యక్రమం పోలీసు అమరవీరులకు నివాళిగా, వారి త్యాగాలను పరిచయం చేయడం కోసం చేపడుతున్న ప్రేరణాత్మక కార్యక్రమాల్లో ఒకటి. పోలీసులు సమాజ రక్షణలో ఎంత కీలకమో, సమాజ రక్షణలో ఏ విధమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉండాలో తెలియజేస్తూ సేవాభావాన్ని పెంపొందించడం ముఖ్య ఉద్దేశమని అదనపు ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు.

రూ.350కోట్లతో అభివృద్ధి పనులు

- మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి

విజయనగరం రూరల్: ఉపాధి హామీ పథకం నిధులు రూ.350కోట్లతో జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు రాష్ట్ర సెర్ప్, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాపరిషత్ సాధారణ సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల్లో కాంట్రాక్టర్ వ్యవస్థ వస్తుందనే భావనలో సభ్యులు ఉన్నారని, అటువంటి అపోహాలు పెట్టుకోవనవసరం లేదన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగానే మెండర్‌షిప్ ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఈ నిధులతో పార్టీలకతీతంగా అన్ని గ్రామాల్లోనూ సీసీరోడ్లు, సీసీడ్రైన్లు, తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే అధికారులు ఉపాధిహామీ పనులు చేపడతారని స్పష్టం చేశారు. గ్రామాల్లో పనులు ఆగకుండా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి నాంది పలకాలని పిలుపునిచ్చారు. గుర్ల డయేరియా బారిన పడి మృతిచెందిన బాధిత కుటుంబాలను ఆదుకునే విషయమై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని ఇందుకు ఇప్పటికే జిల్లా పరిషత్ సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. సమావేశంలో మంత్రులతో పాటు స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన విద్యార్థులు

- జెడ్పీ కార్యాలయం ముట్టడి
- పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్
- త్వరలోనే విడుదల చేస్తామన్న మంత్రులు, ఎమ్మెల్యేలు


మంత్రులకు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) విజయనగరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విచ్చేసిన విద్యార్థులు శుక్రవారం రోడ్డెక్కారు. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్ భవనాన్ని శుక్రవారం ముట్టడించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.రాము మాట్లాడుతూ డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు రెండేళ్లుగా ప్రభుత్వం పూర్తిస్థాయిలో స్కాలర్‌షిప్‌లు బకాయిలు పడిందని, ఈ రెండేళ్ల కాలంలో ఒక రూపాయి కూడా ఇవ్వని పరిస్థితి దాపురించిందని విమర్శించారు. స్కాలర్‌షిప్‌లు రాకపోవడంతో ఫీజులు చెల్లించలేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకపక్క యాజమాన్యాలు ఫీజులు చెల్లిస్తేనే పరీక్షకు అనుమతి ఇస్తామన్న బెదిరింపులతో, మరోపక్క స్కాలర్‌షిప్‌లు ఇవ్వలేని ప్రభుత్వ చేతకాని తనంతో విద్యార్థులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించిందని దుయ్యబట్టారు. స్కాలర్‌షిప్ నిధుల కోసం ఇన్నాళ్లు వేచి చూశామని ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఈరోజు జిల్లా పరిషత్ భవనాన్ని ముట్టడించి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నామని చెప్పారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయాలని విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల వద్దకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి వచ్చి నిధుల విడుదలకు విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో మాట్లాడి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పోలీసు బందోబస్తుతో జిల్లా పరిషత్ భవనంవద్ద గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రావు, విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజు, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, విజయనగరం ఎంపీ అప్పలనాయుడికి స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ బృందం వినతిపత్రం అందించింది. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి సమీర, శిరీష, రమేష్, నాయకులు వంశీ, భారతి, రూప, అను, సోమేష్ ,రాజు, జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.